# క్యాంపస్ పక్షులు

—వేదాంతం మనోహరాచారి

కాలేజీ క్యాంపస్‌ని సూర్యుడు కాస్త వ్యత్యాసంగా విశ్లేషించాడు.

మంచు బిందువులని ఆవిరి చేసే ప్రజ్వలంతో బిల్డింగు శిఖరాలను కడిగాడు.

విస్తృతమైన ప్లేగ్రౌండ్స్ అంచులని చెట్ల నీడలతో చెక్కాడు. భారీ కారిడార్స్‌ని

స్థూల స్తంభాల నీడలతో జామెట్రికల్‌గా చిత్రించాడు.



'చిన్నది' అన్న పదమే వాడరాదనిపించింది మధుకి. కాలేజి గేటు, ప్లే గ్రౌండ్స్, బిల్డింగులు, కారిడార్ స్తంభాలు, చెట్లు — అన్నీ పెద్దవే. చేరి నెల. అయినా కాలేజీపట్ల అద్భుతాశ్చర్యాలు మధులో ఇంకా అలాగే వున్నాయి. ఇక్కడ స్వేచ్ఛ అధికం అని తెలుసు. కానీ ఛాలెంజిలు కూడా చాలా వున్నాయి. ఉదాహరణకు విశ్వనాథరావు అనే క్యాంపస్ తిమింగలం!

సైకిళ్ళమీద గుంపులుగా మాట్లాడుకుంటూ, స్కూటర్ల మీదా, మోటారు సైకిళ్ళ మీదా వీపుకీ, షర్టుకీ మధ్య గాలి నింపుకుని విజిల్ వేస్తూ వేగంగా, కాలి నడకన, చూయింగ్ గమ్ నములుతూ... వొస్తున్నారొచ్చేస్తున్నారు స్టూడెంట్లు! జీన్సులు, టీ షర్టులు, జబ్బాలు, చీరలు, చుడీదార్‌లు, కూలింగ్ గ్లాసులు, అత్తరు తెమ్మెరలు, ఫేస్ క్రీం మెరుగులు. అదో ఫాషన్ పెరేడ్ లాగుంది. అబ్బాయిలు దూరం నుంచే పలకరించుకుంటున్నారు. అమ్మాయిలు దగ్గరికి చేరాక నవ్వుకుంటున్నారు. లెక్చరర్‌లనూ, ప్రొఫెసర్లనూ వినయం కలిసిన మర్యాదతో, అటెండర్లను మర్యాద లేని వినయంతోనూ విష్ చేశారు. ఉపాధ్యాయుల ఒంటి చేతి నమస్కారానికీ, అటెండర్ల ఒంటిచేతి సలాముకీ చాలా వ్యత్యాసం కనిపించింది.

గోడలకు అతికించి వున్న పోస్టర్‌లలో మొదట మీసాల సీనియర్లు ఏయూసీగానో, స్టూడెంట్స్ సెక్రటరీగానో ఎన్నుకోమని నమస్కారం చేస్తున్నారు.

ఆఫీసు గది చెక్క అల్మార్ల 'ఏడి కథ'లో ఆ గర్భవతి క్లర్కు కనిపించింది. మెటర్నిటీ లీవు ఇంకా శాంక్షన్ కాని పరిస్థితిలో ముఖం మాడ్చుకొని కూర్చొని వుంది. 'బాబాజర్దా' వేసుకునే క్లర్కు కుర్చీ ఇంకా ఆక్రమింపబడలేదు.

"విశ్వనాథరావు ఎక్కడ వుంటాడండీ?"

"ప్రొఫెసరా?"

"స్టూడెంటు."

"మువ్వు?"

"నేనూ స్టూడెంటే. ఫస్టియర్ బియస్సీ."

ఫస్టియరేనా అన్న నిర్లక్ష్యాన్ని ముఖ భావంలో ప్రదర్శించి —

"ఓ గ్లాసు నీళ్ళు పట్టా" అని కసిరింది అల్యూమినియం గ్లాసుకిరీటం పెట్టిన మట్టి కూజాని చూపించి.

'భవిష్యత్‌లో దీనితో పనిబడుతుంది. అప్పుడే విముఖత వద్దు" అనుకుంటూ నీళ్ళందించాడు. ఆమె నీళ్ళని స్వారస్యంగా తాగి మధుని కొత్తగా చూసి ఏం కావాలని మళ్ళీ అడిగింది.

చెప్పాడు.

"కేంటీన్‌కి వెళ్ళు."

అతడు అవతలికి వచ్చి కారిడార్ స్తంభాలను ఆశ్రయిస్తూ మెల్లిగా కేంటీన్ వైపు కదిలాడు. రేగింగ్ ఉధృతంగా జరిగే అకెడమిక్ సంవత్సరపు ఆరంభ మాసాలవి. సీనియర్ల కంటపడకుండా వుండడం మంచిదనిపించింది.

క్రింద పోర్టికోలో హెల్మెట్ ఇంకా విప్పని నలభయి ఏళ్ళ 'జూ' లెక్చరరు, పది మంది 'ద్వితీయ' అబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు, ధోవతిని మోకాళ్ళ మీదికి మడిచి కట్టిన యాభయి ఏళ్ళ కెమిస్ట్రీ లేబు అటెండరు... మొత్తం ఒక గుంపుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

కారిడార్ గోడలకి తగిలించబడివున్న గతించిన కాలపు బ్యాచ్‌ల గ్రూప్ ఫోటోలని చూశాడు. ఒక ఫోటోలో ఫిజిక్స్ లెక్చరరు ఇరవై ఏళ్ళ యువకుడిగా వెనుక వరుసలో ముసిముసిగా నవ్వుతూ కనిపించాడు. మరో ఫోటోలో ఒకే ఒక అమ్మాయి వుంది. మొత్తంమీద బుంగ చేతుల రవిక, వదులుగా కట్టిన చీర, కళ్ళలో ఆకర్షణీయమైన జంకు! ఫోటో మీది సంవత్సరాన్ని చూసి నవ్వుకున్నాడు. ఆ అమ్మాయికి ఇప్పుడు సుమారు నలభై ఏళ్ళుంటాయి.

నదరుబోతుకి ఉత్సాహం వచ్చినట్లు గోలగా

24-2-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వార

వుంది కేంటీను. ఈ జనంలో ఎవరు విశ్వనాథరావు? అదో పిశాచ సభలా వుంది. కప్ సాసర్ల చప్పుడు, రకరకాల నవ్వులు... ఒకబ్బాయి మరో అబ్బాయిని నవ్వుకుంటూ తరుముతున్నాడు. కుర్చీలు కాళ్ళని నేలకేసి బరబరా ఈడ్చుకున్నాయి. నాలుగు కుర్చీల టేబుల్ చుట్టూ పది కుర్చీలలో అబ్బాయిలు వివిధ భంగిమల్లో కూర్చుని వున్నారు. ఒక సిగరెట్‌ని నలుగురు పంచుకుంటున్నారు. థమ్సప్ తాగే అబ్బాయి, టీ తాగే అబ్బాయి 'భాయీ-భాయీ'గా మాట్లాడుకుంటున్నారు.

పక్క టేబుల్‌లో నలుగురమ్మాయిలు కావల్సినంత దగ్గరగా కూర్చుని లెక్చరర్‌లను డిస్కస్ చేస్తున్నారు. ఒకమ్మాయి పెదవులకి హేంకీ అడ్డుపెట్టి పకపక నవ్వింది.

బాధ్యత మరచిన వాష్ బేసిన్ కొళాయి నీళ్ళని వృథా చేస్తోంది!

"విశ్వనాథరావు ఎక్కడ?"

ఎంగిలి కప్పులని ప్లాస్టిక్ బకెట్‌లోకి సేకరిస్తున్న మురికి కుర్రోడు 'అక్కడ' అని చూపించాడు.

అటు చూసి అదిరిపడ్డాడు మధు సముద్రంలో షార్క్‌ని చూసిన జాలరిలా! అండర్‌వేర్‌తో తనను, గ్రౌండ్‌కి వచ్చి ఫుట్‌బాల్ ఆడమన్న సీనియర్ విశ్వనాథరావు ఇతనేనా? అమ్మాయిల సమక్షంలో అండర్‌వేర్‌తో తను ఫుట్‌బాల్ ఆడిందీ, వాళ్ళు నవ్వుకుంటూ వెళ్ళిందీ... ఒకటా రెండా? ఎన్ని ఇబ్బందుల పాలయ్యాడు తను! తిరిగి వెళ్ళిపోతే? ఎప్పుడో ఓ రోజు కలిసి తీరాలి. అది ఈ రోజే అవనీ. విశ్వనాథరావు ఒంటరిగా కాఫీ తాగుతున్నాడు.

"మిస్టర్ విశ్వనాథరావ్?"

"యస్?"

లెటర్ చేతికిచ్చాడు మధు. లెటర్‌ని తీసుకుని చదవకుండా మధు వైపు చూశాడు పరీక్షగా.

"కాల్ మీ విశి."

"యస్..." సర్ అనాలా, విశి అనాలా?

"యస్ కాదు. సర్ ఐ స్టాండ్ కరెక్టడ్ అను."

"సర్ ఐ స్టాండ్ కరెక్టడ్."

"గుడ్. వెళ్ళి ఓ కప్పు టీ, రెండు సమోసాలు పట్టా."

అది సెల్ఫ్ సర్వీస్ కేంటీను. క్యూలో నించుని టోకెన్స్ కొని, టీని, సమోసాలని ఊపిరాడని వేగంతో స్వీకరించి 'విశి' దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు. ఇంతలో విశి లెటర్‌ని చదివాడు.

"సమోసాలు నాకు. టీ నీకు. సో నువ్వు సతీష్ తమ్ముడివన్న మాట."

"అవునండి."

"ఈ లెటర్‌ని రేగింగ్ తర్వాత ఇవ్వాల్సింది. యూ డిడ్ ఎ మిస్టేక్."

"సారీ!"

"సారీ చెప్పకు. రేగింగ్ ఎంత అవసరమో సెకండియర్‌కి వచ్చాక తెలుస్తుంది నీకు. సతీష్ ఏం చేస్తున్నాడు?"

"విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో ఉద్యోగం దొరికింది."

## శని-అశని



ధనవంతుడికి
దరిద్రుడు
శని
ధనవంతుడు
దరిద్రుడికి
అశని

—శంకరగంటి రంగాచార్యులు

"గుడ్."

ఇద్దరూ లేచారు.

"నాతో రా!"

థమ్సప్ అబ్బాయి "హోయ్ విశి" అని అరిచాడు.

చాలామంది పలకరించారు. 'విశి' పాపులర్ ఫిగర్ అని అర్థమైంది మధుకి.

"ఎవరీ కుర్రోడు?"

"సతీష్ తమ్ముడు. బొటనవేలు చప్పరిస్తున్నాట్ట. అలవాటు మాన్పించమనీ... అన్నయ్య ఉత్తరం ఇచ్చి పంపాడు!"

అందరు ఘొల్లుమని నవ్వారు. అమ్మాయిలు తల తిప్పి చూశారు. మధుకి అవమానంతో ఎక్కడైనా దాక్కోవాలనిపించింది.

ఓ అబ్బాయి మధుని రేగింగ్‌కి పిలిచాడు.

"ఇప్పుడొద్దు" చెప్పాడు విశి.

"విశి హౌ ఎబౌట్ ఎ పఫ్?"

"ఈ ఆఫర్ నెలాఖరుకి చెయ్యి."

ఇద్దరూ గేటవతలి చిల్లర కొట్టువైపు నడిచారు.

"ఎలా వుంది కాలేజ్?"

"భయంగా" అన్నాడు మధు.

"టూ బేడ్! ఆల్విన్ టాఫ్లర్‌ని చదివావా ఎప్పుడైనా?"

మధు జవాబు చెప్పేలోపే—

"సబ్జెక్ట్ పుస్తకాలు తప్ప వేరే చదివే మొహం కాదని చూస్తేనే తెలుస్తోంది... కాలేజీ జీవితం అర్బనైజేషన్‌కి దారితీస్తుందన్నాడు... ఎవరు?"

"ఆల్విన్ టాఫ్లర్."

"... ముఖ్యంగా నీలాగ గ్రామం నుండి వచ్చిన వాళ్ళకి పరీక్షలకు నోట్సిచ్చి సహాయం చేసేవాడుంటాడు. హోటల్లో కేబరే డాన్సుకి టేబుల్ బుక్ చేసే ఫ్రెండుంటాడు. వాడినీ వీడినీ కలపకు. షాపింగ్‌కి తీసుకెళ్ళే ఫ్రెండు, సిటీలో సందు గొందుని తిప్పి చూపించే దోస్తు, జ్వరం వచ్చి రెండు రోజులు సెలవు పెడితే నుదుటిమీద చెయ్యేసి 'ఇప్పుడెలా వుంది?' అని సానుభూతి ప్రదర్శించే అమ్మాయి, 'నీకీ షర్ట్ బాలేదు ఆ రోజు వేసుకున్నటువంటిది వేసుకో' అనే బ్యూటీ... అందరితో ఫ్రీగా కలిసిపో. ఎవరినీ సీరియస్‌గా తీసుకోకు. హాస్టల్ రొటీన్ నుంచి తప్పించి ఓ శనివారం సాయంత్రం నిన్ను తనింటికి తీసుకెళ్ళి వాళ్ళ కుటుంబాన్ని పరిచయం చేసి ఇంటి భోజనం రుచి చూపించే 'బెస్టు ఫ్రెండు' చాలా అరుదుగా వుంటారు. గ్రామంలోలాగ పట్నంలో పాలవాడిని, దోబీని అంత రంగికంగా తెలుసుకోరు. బికాజ్ టూమెనీ పీపుల్ టూ మూవ్ విత్..."

"పీడు పోజులు కొడుతున్నాడు."

మధు మనసు భయం నుండి అస్పష్టతకి దారి తీస్తోంది.

చిల్లర కొట్టులో 'సిజర్స్' తీసికొని వెలిగించి, పొగని మధు మొహం మీదికి వూదాడు.

చిల్లరకొట్టు పెద్ద మనిషి 'విశి'ని మురచుర చూశాడు.

"ఏం మామ బిడ్డ చెప్పుడిస్తవ్? పుస్తె కొపి పెట్టిన ఎప్పుడో..." మధుని చూసి "...మామ ఆఖరు బిడ్డని చూడాలి నువ్వు. యమ ఫిగర్!"

"యాభయి రెండు రూపాయలు బాకీ వుంది. బిడ్డను చేస్కుంటడట!"

"అది కట్నం అనుకో!"

చిల్లర కొట్టతను కారెపట్టిన పళ్ళతో నవ్వాడు.

ఎవరో అబ్బాయి ఆయన బట్టతలను రెండు చేతులతో తడిమి "ఊ..." అని అరిచాడు. నవ్వులు.

వాళ్ళకు ఈ పరాచికం మామూలే అని తెల్సుకున్నాడు మధు.

"ఫస్టవర్ ఎవరు?"

"వి.ఎస్.ఆర్." చెప్పాడు మధు.

"బోరు! వెళ్ళక్కర్లేదు! నాతో రా!"

ఇద్దరూ స్టేడియం మెట్లమీద కూర్చున్నారు. విశి సిగరెట్ ఆఫర్ చేశాడు.

"అలవాటు లేదండి."

విశి బలవంతం చేయలేదు.

"డిగ్రీ అయిపోయేసరికి నేర్చుకుంటావులే. వాడ్డు యూ థింక్ ఆఫ్ లవ్?"

"ప్రేమంటేనా? ఏమీ అనుకోవడం లేదండి."

"ఏమీ అనుకోకు! కాలేజీలో లవర్స్ తక్కువ. హియర్ ఎవ్విబడీ. చేరగానే ఎవరికైనా భయం సహజం. అమ్మాయిలకు కూడా. వాళ్ళకంతా మనం ఎలా కన్పిస్తామో తెలుసా?"

మధు శ్రద్ధగా వింటున్నాడు.

"ఆపదలనుండి కాపాడే సోదరులుగా! సోదరులు కాని వారు విలన్లు. సెకండియర్, థర్డియర్‌లో హీరో వర్షిప్ మొదలౌతుంది. కొందరు 'ప్రేమ', 'అనుబంధం' అంటూ తిరుగుతారు. అదో ఫాషన్. నువ్వు కూడా సరసమాడు. ప్రేమించకు."

"నా కలాంటి ఆలోచనే లేదండి. మామ కూతురు నా కోసం సిద్ధంగా వుంది.'

'కిక్' అని నవ్వాడు విశి.

"పేరేం పేరు? ఓ రోజు నాకు పరిచయం చెయ్యి!"

మధుకి ఏమనాలో అర్థం కాలేదు. 'ఇదేం రకం పరాచికం?"

గంటసేపు ఏవేవో మాట్లాడారు. చాలా విషయాల్లో అనుభవం వున్నట్టు మాట్లాడాడు విశి.

క్లాసుకి వెళ్తుంటే మధులో అస్పష్టత అధికమైంది.

అతడికి ఎవరి ప్రవర్తనా పూర్తిగా అర్థం కావడం లేదు.

* * * *

దసరా వెకేషన్ ముగిసి కేంపస్ అంతా కళకళ లాడుతోంది.

కెమిస్ట్రీ లెక్చరర్ వస్తూనే చాక్‌పీస్ చివరను తుంచి పాఠం ప్రారంభించాడు. రెండో వాక్యంలో చాక్‌పీసు విరిగింది. 'రక్తసంబంధం' ఎన్టీఆర్ పేంటు వేశాడు. మూడో గుండీకీ నాలుగో గుండీకీ మధ్య షర్టు ఇకిలించి లోపల బొజ్జ మీది బనీను కనిపించింది. పాఠం చెపుతూ బాపూ నద్కర్ణీనీ, కపిల్‌దేవ్‌నీ పోల్చాడు.

ఆ కాలం క్రికెట్... ఇట్ వస్ గ్రేట్?''

పిల్లలు వినడం, వినకపోవడం అతడికి ముఖ్యం కాదనిపించింది మధుకి. ఆయన లెక్చర్‌లో ఆసక్తి కన్నా అనుభవం అధికంగా కనిపించింది.

రహస్యం మాట్లాడినా ఉన్నస్థాయి బొంగురు గొంతుతో మాట్లాడే శ్యామ్‌సుందర్ 'బెజవాడ బండి' మురళీకృష్ణతో ఏదో చెపుతున్నాడు.

''... రాత్రి కరెంట్ కట్! ఎదురుగా చీరల హాస్టల్. ఒకడు బట్టలన్నిప్పి కిటికీ గడప మీద నిలబడ్డాడు. చీరల బాతాఖాని వినిపిస్తూనేవుంది. ఎంతనుకున్నావ్? యాభయి అడుగులు. అంతే. కరెంటొచ్చింది. వీడిట్టనే నిలబడ్డాడు. ఇగనా... చీర లన్నీ కీకీ అని ఒర్లుకుంట ఒకటే ఉరకడం...!''

శ్యామ్ సుందర్ కథను క్లాసంతా నిశ్శబ్దంగా విన్నారు. కెమిస్ట్రీ పాఠం ఆగిపోయింది.

''స్టాఫ్ రూమ్‌కి వెళ్ళి క్రికెట్ కామెంటరీ వినడం...'' అని తీర్మానించి ఆయన వెళ్ళిపోయాడు. డెస్కుల మీద దమదమా కొట్టి ఆర్భాటం చేశా రంతా.

గిరిజ అనే అమ్మాయి కొంగు చివరను నెర్వస్‌గా పట్టుకొని బెంచీల మధ్య నుంచి సమర్థంగా నడిచి మధు దగ్గరకొచ్చింది. ఉన్నట్టుండి నిశ్శబ్దం. కొందరు ఊపిరి బిగపట్టారు...

''మీ అన్న నోట్సు అడిగి తీసుకోమని నిశి చెప్పారు. అలాగే ఎమెల్ ఖన్నా వెక్టర్స్ వుందా?''


''అబ్బే అంతేనా...!'' అని నిట్టూర్చాడు మురళీ కృష్ణ.

''ఎమెల్ ఖన్నా నా దగ్గరుంది!'' అని పది కంఠాలు ఉత్సాహంగా ఆఫర్ చేశాయి.

ఒక పుస్తకం తీసుకుని, ఒక నవ్వు విసిరి, థాంక్స్ చెప్పి తన 'స్లేస్'కు వెళ్ళిపోయింది గిరిజ.

''దానికి నోట్సిస్తే పళ్ళూడుతాయి'' అన్నాడు మనోజ్. మనోజ్‌కీ, మధుకీ అసలే పడదు. ఫిజిక్స్ లేబ్‌లో ఫిజికల్ బేలన్స్ విషయంలో మాటామాటా ముదిరి తన్నుల వరకూ వెళ్ళింది వ్యవహారం. పై చదువులకి 'స్టేట్స్' వెళ్ళాలని తీవ్రంగా తయారవు తున్నాడు మనోజ్. ఆ రోజు లేబ్‌లో అనుకున్నాడు. ఆ అనుకోవడం నిర్ణయంగా, దృఢ సంకల్పంగా, లక్ష్యంగా క్షణాల్లో రూపుదిద్దుకుంది.

'ఎలాగైనా చదువులో మనోజ్‌ని అధిగమించాలి! అహర్నిశలు చదివైనా సరే!'



**నా కిటికీ**

మూస్తే మూడడుగుల కంత
తెరిస్తే విశ్వరూపపు వింత
నా కిటికీది
బాలకృష్ణుడి నోరు
వామనమూర్తి తీరు

—కె.గోదావరి శర్మ

వీళ్ళ పోటీ గురించి కేంటీన్‌లో, లైబ్రరీలో మాట్లాడుకున్నారంతా. కొందరు ''అసలు మధు రాదు, మనోజ్ రాదు. గిరిజ వస్తది ఫస్టు'' అన్నారు.

క్లాసులో సగం మంది మధు వైపూ, మిగతా సగం మనోజ్ వైపూ చేరారు. ఇది పరీక్షలు దగ్గిర పడేసరికి 'పరీక్ష జ్వరం'గా మారుతుంది.

* * * *

క్రికెట్‌లో మధు సలభై రెండు నాటౌట్ చేసి నప్పుడు వత్సల వచ్చింది అతడిని చూడ్డానికి. 'ద్వితీయ' టీమూ, 'ప్రథమ' టీమూ ఆడిన మేచ్ అది. మధు ఒక్కడిదే 'వెల్ సస్టెయిన్డ్ వాక్!' వున్న ప్యాడ్స్ అన్నీ సీనియర్లు తీసుకున్నారు. ప్రతి రన్నుకీ పిచ్ మధ్యలో కలుసుకుని బేట్స్‌మెన్ బేట్లు మార్చు కోవాలి. ఉన్నదొకటే మంచి బేటు.

పీటీ గదిలో తాళం కప్ప రక్షణలో వుంచబడిన కొత్త ఆట పరికరాలు పెద్ద ఎత్తు పోటీలకే అవతలికి వస్తాయి. పెద్ద ఎత్తు పోటీలంటే ప్రిన్సిపల్ గదిలో 'షీల్డు'లుగా తగిలించబడేంత ముఖ్యమైన మేచ్‌లు.

శ్యామ్‌సుందర్ ఒక 'షార్ట్ పిచ్డ్' బాల్‌ని నెత్తిమీద వేసుకుని గాయం చేసుకున్నాడు. రక్తం కారింది.

చెట్ల క్రింద కూర్చున్న బేటింగ్ టీమూ, సునిల్ గవాస్కర్ క్యాప్ వేసుకున్న స్కోరరూ, గ్లూకోస్ పొట్లాలను మోసుకునే అబ్బాయిూ, ప్రేక్షకులూ, అందరూ పరిగెత్తుకొచ్చారు. ఈ గొడవలో మధుకి కాస్త వ్యవధి దొరికింది. బ్యాట్ పడేసి దూరంగా వెళ్ళి కూర్చున్నాడు ఉస్సూరుమంటూ.

అతడి మామ కూతురు వత్సల తుళ్ళుతూ వచ్చింది.

''బావా సూపర్బ్! సెంచరీ చేసెయ్...'' వత్సల వచ్చినట్టు మధుకి తెలీదు.

''నీయ్ నువ్వెందుకొచ్చావ్? ఇక్కడికంతా రాకూ డదు!''

''మా ఇంట్లో వుండమంటే వుండవు. మూడాలని పించింది వచ్చేశాను.''

ఆమె అంత తేలిగ్గా చెప్పింది అతడికి ఆవేశాన్ని తెప్పించింది. ఇంతలో ఎవరో వత్సలను చూడనే చూశారు.

''హాయ్! అమ్మాయెవరు?''

''ఉరేయ్, మధు లవర్!''

చాలామంది శ్యాంసుందర్‌ని వదిలేసి వత్సల చుట్టూ చేరారు. టెన్త్ ఫెయిలై ఇంట్లో కూర్చున్న వత్సలకు ఇదంతా అర్థం కాలేదు. భోరుమని ఏడ్వ మొదలుపెట్టింది.

''అందరూ వెళ్ళిపోండి ప్లీజ్! ఏడిపించొద్దు.''

మధు కొంచెంసేపు ప్రాధేయపడి లాభం లేక మొరటుగా మారాడు. వత్సల మీద చేయి వేసిన సీని యరుని చెంప చెళ్ళుమనిపించాడు. మరో ఇద్దర్ని డొక్కలో గుద్దాడు. మ్యాచ్ చూడవచ్చిన నిశి అస లిదేదీ పట్టించుకోకుండా, మధుకి సహాయం చేసే ప్రయత్నమైనా చేయకుండా వెళ్ళిపోయాడు.

గేలరీకి మరోవైపు హాకీ ప్రాక్టీస్ చేస్తున్న మనోజ్ గోల విని పరుగెత్తుకొచ్చాడు.

అప్పటికే మధు అభిమన్యుడై పోయాడు. పెదవి చిట్లి రక్తం కారుతోంది. కుడి కన్ను క్రింద కమిలి పోయింది.

మనోజ్ మధుకి తోడయ్యాడు. చేతిలో హాకీ స్టిక్ వుంది. అతడు అలా విజృంభిస్తాడని మధు అనుకో లేదు. అంత భయం, బాధలోనూ ఆశ్చర్యం కలిగింది. తనూ క్రికెట్ స్టంప్ నందుకున్నాడు. ఇద్దరూ కలిసి విజృంభించేసరికి మూక చెదిరింది. తమాషా చేయ వచ్చిన వాళ్ళూ, చూడవచ్చిన వాళ్ళూ అవసరవస రంగా తప్పుకున్నారు. వత్సల ఏడుస్తూనే వుంది.

''మధు త్వరగా రా! ఆటో ఎక్కించేద్దాం.''

వత్సలకు చెరోవైపు రక్షణగా నడిచి ఆమెను గేటవ తలికి తీసుకువచ్చారు.

''చూడండి సిస్టర్. తప్పు ఎవరిదీ కాదు. కాలేజీ లోనే ఎందరో అమ్మాయిలున్నారు. వాళ్ళకేమీ అవటం లేదే! క్రౌడ్ సైకాలజీ అలాగే వుంటుంది. మీరిక ఇటు రాకండి.''

ఆటో వెళ్ళిపోయింది. మధుకి కళ్ళు చెమ్మగిల్లాయి.

''మనోజ్ ఐ నెవర్ ఎక్స్‌పెక్టెడ్... నీవు సహాయం చేస్తావని అనుకోలేదు... చాలా థాంక్స్!''

''ఆమె రావడం కన్నా వొచ్చి ఏడ్చింది తప్పు''

ఇద్దరూ కాలేజీ గేటవతల వున్నారు.

''మనకిక ముందుంది భరతం'' చెప్పాడు మనోజ్.

నిబ్బరంగా నిలబడి వున్న కాలేజి బిల్డింగుల వైపు చూశారు. ప్రధానమైన బిల్డింగు డోమ్ క్రింద పాచి పట్టిన సిమెంట్ అక్షరాల్లో వ్రాసి వుంది: ఎస్టాబ్లిష్డ్ 1932.

''అవును. సీనియర్లు మన పని పడతారు..వుయ్ విల్ ఫేస్ ఇట్'' అన్నాడు మధు.

చాలా ఏళ్ళ తరువాత కారిడార్‌లో గ్రూప్ ఫోటోని చూసి ఓ ఫ్రెషర్ అనుకుంటాడు 'వీళ్ళంతా ఇప్పుడేం చేస్తున్నారో!' అని.

మధు, మనోజ్ నోరు బార్లా తెరిచిన కాలేజి గేటు లోపలికి వెళ్ళారు.

*